# హార్బర్ పేట అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఫిషింగ్‌హార్బర్, పండూరులలో గడప గడపకూ మన ప్రభుత్వం

**కాకినాడ రూరల్:** గతంలో తన హయాంలోనే ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు మళ్లీ తానే అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం ఉదయం వాకలపూడి పరిధిలోని ఫిషింగ్‌హార్బర్‌పేట, సాయంత్రం పండూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో కలసి ఉదయం ఇంటింటికీ పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వీధిలైట్లు, తాగునీటి సమస్యలను ప్రధాన సమస్యలుగా మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుచ్చారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. డీఎల్‌డీఓ నారాయణ మూర్తిని పిలిచి తాగునీటి సమస్య పరిష్కారానికి జీఎల్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని, ఈ లోగా ట్యాంకర్లతో నీటి సరఫరా అందించాలని ఆదేశించారు. పంచాయతీ ఈవో పాండురంగారావును హార్బర్‌పేటలో వీధిదీపాలు రాత్రిపూట పూర్తిగా వెలిగేలా చూడాలన్నారు. కొందరు మహిళలు తమకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు రద్దు చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్థానికంగా ఉన్నవారి పట్టాలు రద్దు కాలేదని, వలస వచ్చిన వారివే రద్దైనట్టు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధికి సంబంధించి బుక్‌లెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మురార్జీ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, మత్స్యకార నాయకుడు, మండల కో-ఆప్షన్ సభ్యుడు సంగాడి మోషే, వేర్ హౌసింగ్ డైరెక్టర్ గంపల రాణి, నల్లా రాణి, శ్రీను, సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్ములమడక నాగమణి, గొల్లపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.


ఫిషింగ్ హార్బర్‌పేటలో మత్స్యకార మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


సర్పవరంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

సాయంత్రం పండూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ వలవల అమ్మాజీ, ఉపసర్పంచ్ వలవలస వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీను తదితరులతో కలిసి గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, నందిపాటి ధర్మరాజు, అజయ్, బావిశెట్టి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**

మండలంలోని సర్పవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.1.4 కోట్లతో ఎస్సీ పేటలో కమ్యూనిటీ నిర్మాణానికి శంకుస్థాపన, గ్రామంలో పలు వీధులు, భావనారాయణపురంలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన విజ్ఞాపనల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ శీలం నాగేశ్వరరావు (చిన్నా), ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీలు సారా రాజేష్, గుత్తుల శ్రీనివాసరావు, సూర్యచంద్ర, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, గ్రామ నాయకులు పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, వార్డు సభ్యుడు చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం


కూరాడలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కరప:** ప్రజలచెంతకే వైద్య సేవలను తీసుకువెళ్లి వారి ఆరోగ్యపరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కొత్తగా అమలులోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసేలా చూడాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని కూరాడలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలసి 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభించారు. పీహెచ్‌సీకి కొత్తగా వచ్చిన 104 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ సింధూర, సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ (కొండ), జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి,బాలాజీ, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వెలుగుబంట్ల నారయ్య వివిధ గ్రామాలసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా మహేష్‌కుమార్

**కాకినాడ:** నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి రావిరాల మహేష్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా విజయవాడ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన ఇక్కడకు రానున్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన మహేష్‌కుమార్ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ఏడాది క్రితం ఇక్కడ కమిషనర్‌గా నియమితులైన కె.రమేష్‌ను బదిలీ చేసినప్పటికీ ఇంకా పోస్టింగ్ ఎక్కడన్నది నిర్ణయించలేదు.

### 10న నవగ్రహ హోమం

**బోట్‌క్లబ్:** స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం నవగ్రహ హోమం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి గురువారం ఈ విషయం తెలిపారు.

### అవయవ దానంపై అవగాహన అవసరం


బాదం బాలకృష్ణ

**బాలాజీచెరువు:** అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ డీవీ రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నేత్ర, అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రెయిన్ డెడ్ వంటి కేసుల్లో ఒకరి అవయవాలు మరొకరికి అమర్చి ప్రాణ దానం చేస్తున్నారన్నారు. మరణించిన తరువాత మట్టిలో కలసిపోయే కన్నా నలుగురికి ఉపయోగపడే వాటిని ప్రోత్సహించాలన్నారు. తమ ఐబ్యాంక్ ద్వారా 16 ఏళ్ల కాలంలో 6400 కార్నియాలు సేకరించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్దనరావు, డాక్టర్ రామస్వరూప్, పాలడుగు సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.

### 11న చలో విజయవాడ

**కాకినాడ సిటీ:** దళితులు, మైనార్టీలపై హత్యాకాండ కొనసాగుతుందని, ఈ అకృత్యాలను నిరసిస్తూ ఈనెల 11న పూలే జయంతి రోజున 'ఛలో విజయవాడ' జయప్రదం చేయాలని అఖిలపక్ష రాజకీయ దళిత ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సాంబమూర్తినగర్ పీఆర్ భవన్‌లో దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా జిల్లా రౌండ్‌టేబుల్ సమావేశం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. సీపీఐ, టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన, బీఎస్పీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఆర్పీఐ, లిబరేషన్ జనశక్తి తదితర పార్టీలు ప్రజా సంఘాల నేతలు తాటిపాక మధు, ముప్పాల సుబ్బారావు, ఎస్.వీరు, ఎ.రామేశ్వరరావు, ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల పర్యటన

**కరప:** మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి గురువారం కూరాడలో పర్యటించి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు పంచారు. టీడీపీ నాయకులు బుంగా సింహాద్రి, పంపన కన్నారావు, కాకర్ల బుజ్జిబాబు, సీహెచ్ జయేంద్రబాబు, గండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# మహిళలకే 70 శాతం పథకాలు..

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ముగిసిన వైఎస్సార్ ఆసరా సంబరాలు

**కాకినాడ:** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అందువల్లే మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేయడంతో పాటు 70 శాతం పథకాలను వారి పేరుతోనే ఇస్తున్నారన్నారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ప్రజల కష్టాలను కళ్లతో చూసి, మనసుతో ఆలోచించే ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలించడం ప్రజల అదృష్టమన్నారు. అటువంటి సీఎంను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కోరారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి మాట్లాడుతూ పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మహిళలను దగా చేస్తే, వైఎస్సార్ ఆసరా ద్వారా సీఎం జగన్ భరోసాగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 'నేను విన్నాను-నేను ఉన్నాను' అంటూ అభయమిచ్చిన సీఎం జగన్.. అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు భరోసాగా నిలిచారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా నగర పరిధిలో మూడో విడత సుమారు 26 కోట్ల మేరకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ మేరకు స్వయం సహాయక సంఘాల సమక్షంలో ప్రజాప్రతినిధులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం లబ్దిదారులకు మెగా చెక్కును విడుదల చేశారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ పరిశీలకులు పీకే రావు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్ కుమార్, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, టీపీ ఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సీఎంఎం వెంకట్రాజు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు


ఆసరా కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

# 'జగనన్నే మా భవిష్యత్' సక్సెస్ చేద్దాం

- ఎమ్మెల్యే ద్వారంపూడి
- ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

**కాకినాడ:** వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు శుక్రవారం నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. సచివాలయ పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**మసీదు అభివృద్ధికి సహకరిస్తా**

కాకినాడ రేచర్లపేట సమీపంలోని శిథిలావస్థకు చేరిన నూర్‌బాషా సంఘం-మస్జిద్- ఎ- అల్ ఫారాన్। మసీదు అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడతానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం మసీదు ఆవరణలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఇప్పటికే నగరంలోని అనేక మసీదులను అభివృద్ధి చేసుకున్నామని, ఈ మసీదుపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ఎల్లప్పుడూ తనకు అండగా ఉన్న ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ద్వారంపూడి చెప్పారు. ఈ సందర్భంగా మసీదు పునర్నిర్మాణం కోసం ఇక్బాల్ ఆలీ రూ.లక్ష, ఎండీ అస్గర్ రూ.2 లక్షలు, అజ్జు రూ.లక్ష ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, కమిటీ అధ్యక్షుడు షేక్ అల్లా బాషా, మసీదు గౌరవాధ్యక్షుడు ఎండీ అస్గర్, అధ్యక్షుడు షేక్ అల్లా బాషా, ఉపాధ్యక్షుడు నూర్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, కార్యదర్శి షేక్ నయీం, కోశాధికారి షేక్ అహ్మద్, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**కార్మికులకు ఆర్థిక సాయం**

కష్టాల్లో ఉన్న సాటి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలనే మంచి దృక్పథం పదిమందికీ ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. లక్ష్మీ డీప్ వాటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన 13 మంది కార్మికులు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా.. వారి కుటుంబాలకు యూనియన్ తరపున గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగాన్ని తోటి కార్మికుల భావి అవసరాలకు వినియోగించాలనే దృక్పథం అభినందనీయమన్నారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, యూనియన్ అధ్యక్షుడు పట్టా ధనలక్ష్మి, కార్యదర్శి బలసాడి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

# రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

**కాకినాడ సిటీ:** భూముల రీ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ ప్రారంభోత్సవాలకు సిద్ధం చేసిన కాలనీలను అధికారులు సందర్శించి మిగిలిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల గ్రౌండింగ్ పనులు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనుల పురోగతిని డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కాకినాడ కమిషనర్ కె.రమేష్, సీపీవో త్రినాథ్, వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయకుమార్, డ్వామా పీడీ ఎం.వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీపీవో ఆర్.విక్టర్, పంచాయతీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణకు సిద్ధంకండి : జేసీ ఇలక్కియ

**కాకినాడ సిటీ:** ఆర్బీకేల ద్వారా రబీ ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలని జేసీ ఎస్.ఇలక్కియ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో కస్టోడియన్లు, సేకరణ మద్దతు విభాగాల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు.

సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి, డీఎస్‌వో డి.చాముండేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమజ్జయంతి

**బోట్‌క్లబ్:** హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్‌కాలనీలోని దాసాంజనేయ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం ఐదో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మందిర నిర్వాహకులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో అభిషేకాలు, పుష్పాలంకరణ చేశారు. మధ్వేష్ మాట్లాడుతూ ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థస్వామి చేతులమీదుగా మందిరంలో దాసాంజనేయస్వామి ప్రతిష్ఠ జరిగిందన్నారు.

**వైభవంగా శ్రీపుష్పోత్సవం**

వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి శ్రీపుష్పోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేక మండపంలో నుంచి ఈ ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న స్వామి, అమ్మవార్లకు పువ్వులు, స్వీట్లు సమర్పించారు.

**సీతారామస్వామికి చక్రస్నానం**

స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి వారికి గురువారం వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చక్రస్నానాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు, పవన్‌ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో స్వామి వారి శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

# జగ్జీవన్‌రామ్, పూలే భవనాలు నిర్మించాలి

**కాకినాడ సిటీ:** మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ వల్లూరి సత్తిబాబు ఆధ్వర్యంలో సాంబమూర్తినగర్ రెవెన్యూ కాలనీలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవనానికి కేటాయించిన స్థలంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, 93 కులాల బీసీ అధ్యోఉలు మాకినీడి భాస్కర్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట వరప్రసాద్ తదితరులు పాల్గొని జగ్జీవన్‌రామ్ భవనానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ చేపట్టాలని కోరారు. అలాగే కాకినాడ శారదమ్మ గుడి సమీపంలో మహాత్మ జ్యోతిరావు పూలే భవనానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు తాళ్లూరి రాజు, జగ్జీవన్‌రామ్ భవనం కమిటీ సభ్యులు పువ్వల భాస్కరరావు, నరుకుర్తి రాజు, మిరియాల వీరబాబు, నేకూరి ఆనంద్, పువ్వుల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంకురాత్రి సేవలు మరువలేం

- పెన్షనర్స్ అసోసియేషన్ సత్కారం

**కాకినాడ సిటీ:** కిరణ్ కంటి ఆసుపత్రి ద్వారా లక్షలాది మంది పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత చదువులు చెప్పించడంతో తరిస్తున్న సంకురాత్రి చంద్రశేఖర్‌కు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయడం గొప్ప విషయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం అన్నారు. గురువారం కిరణ్ కంటి ఆసుపత్రి అధినేత, పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను పెన్షనర్స్ భవనంలో సత్కరించారు. చంద్రశేఖర్ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, సేవలను పద్మనాభం కొనియాడారు. ఆయన మరిన్ని ఉన్నత అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పీఎస్ఎస్ఎస్‌పీ శాస్త్రి డాక్టర్ చంద్రశేఖర్ సేవలను కొనియాడుతూ రాసిన సన్మాన పత్రాన్ని సమర్పించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 4 లక్షల మందికి కంటి చికిత్సలు చేసినట్టు తెలిపారు. స్తోమత కలిగిన వారి నుంచి వైద్య ఖర్చులు వసూలు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తాను చేస్తున్న సేవలను గుర్తించడం ఒక ఎత్తైతే అందరి కృషి, సహకారం వల్ల మాత్రమే తనకు పద్మశ్రీ పురస్కారం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇబ్రహీం, భాస్కరరావు, హనుమంతరావు, జగపతిరాజు, సుబ్రహ్మణ్యం తదితరులతో పాటు 200 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పద్మనాభం, కార్యదర్శి శాస్త్రి తదితరులు

## సచివాలయ ఉద్యోగుల వితరణ

**కరప:** ప్రమాదవశాత్తూ గాయపడి, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సాటి ఉద్యోగి బిరుదా శివరావుకు గ్రామ సచివాలయం ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. పెద్దాపురప్పాడు లైన్‌మన్ విద్యుదాఘాతంతో గాయపడి చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామ కార్యదర్శి డి.దుర్గాభవాని, వీఆర్వో ఎం.నాగేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ ఎం.శివరామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ బిరుదా సుమ తదితరులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

**కాకినాడ క్రైం:** నగరం పరిధిలో పదో తరగతి పరీక్షలు జరగనున్న కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సంబంధించి స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో చర్చించారు. సీసీ కెమేరాల ఏర్పాటు సహా ప్రత్యేక సిబ్బందితో భద్రత కొనసాగాలని ఆదేశించారు.

## ఆస్తి పన్నుపై ఐదు శాతం రాయితీ

**కాకినాడ:** ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించిందని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. రెండు అర్థ సంవత్సరాలకు సంబంధించిన మొత్తం పన్నును ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోపుగా చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. పన్ను చెల్లించే సమయంలో ఐదు శాతం తగ్గించి కట్టవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.